# కేంద్ర బలగాల లక్ష్యం మావోయిస్టు తిప్పరి తిరుపతి

- ఎవరీ తిరుపతి ?
- రూ .కోటి రివార్డ్ ప్రకటించిన ఎన్ఐఏ

**శెనార్తి మీడియా, ప్రత్యేక ప్రతినిధి:**

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు ఎదురు కాల్పుల్లో మరణించిన విషయం తెలిసిందే. ఈయన మరణంతో పార్టీ కి జరగాల్సిన నష్టం కంటే ఎక్కువనే జరిగింది. ఆ నష్టాన్ని భర్తీ చేయడం పార్టీకి సాధ్యం కాదనేది స్పష్టం. చర్చలకు వస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినప్పటికీ ప్రభుత్వం అడుగు ముందుగు వేయడం లేదు. వెనక్కి తగ్గుతోంది. కానీ చర్చలకు వీసమంత కూడా అవకాశం ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో మావోయిస్టు పార్టీకి ప్రభుత్వంతో పోరాటమే మిగిలి ఉంది. కేంద్ర ప్రభుత్వం బలగాలు రోజు, రోజుకు ముందుకు దూసుకు వెళుతున్నాయి. బేస్ క్యాంపులతో లక్ష్యాన్ని సాధిస్తున్నాయి. పార్టీ చరిత్రలో కార్యదర్శులను నష్టపోలేదు. కానీ మొట్ట మొదటిసారి ఆ నష్టాన్ని మోయక తప్పడంలేదు. మావోయిస్టు పార్టీలో మొదట 16 మంది పొలిట్ బ్యూరోలు ఉండేవారు. లొంగుబాటు, అనారోగ్యాలతో మరణం, ఎదురుకాల్పుల నేపథ్యంలో నలుగురు పొలిట్ బ్యూరోలు మాత్రమే ప్రస్తుతం మిగిలి ఉన్నారు. వీరిలో మాజీ కార్యదర్శి ముప్పాళ లక్ష్మణ్ రావు, మల్లోజుల వేవుగోపాల్ రావు, తిప్పరి తిరుపతి, మిసిర్ బెస్రా ఉన్నారు. మిసిర్ బెస్రా ఒక్కడే ఝార్ఖండ్ నివాసి. మిగతా ముగ్గురు కూడా తెలంగాణ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాసులే కావడం విశేషం. వయోభారం, అనారోగ్యం కారణంతోనే గణపతి బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. వేణుగోపాల్ రావు కూడా అనారోగ్య సమస్యలతోనే ఇబ్బందిగా ఉన్నాడని సమాచారం. కార్యదర్శి భాధ్యతలను నిర్వహించాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో తిప్పరి తిరుపతి తోనే సాధ్యమవుతుందని నిఘా వర్గాలు ఇప్పటికే పసిగట్టాయి. ఇప్పుడు తిరుపతి లక్ష్యంగా బలగాలు జల్లెడ పడుతున్నాయి. మావోయిస్టు పార్టీ నంబాల మరణంతో జరిగిన నష్టం నుంచి కోలుకునేలోపుననే తిరుపతిని కూడా మావోయిస్టు పార్టీకి దూరం చేయడానికి బలగాలు పావులు కదుపుతున్నాయి. తిప్పరి తిరుపతి పార్టీకి దూరమైన నేపథ్యంలో పార్టీ భవిష్యత్తును ఊహించడం కష్టమేననే అభిప్రాయాలు సైతం వ్యక్తమవుతున్నాయి. తిప్పరి తిరుపతి మావోయిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు. కేంద్ర కమిటీ సభ్యుడు.అదనంగా మిలటరీ భాద్యతలు కూడా నిర్వహిస్తున్నాడు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోరుట్ల నివాసి తిరుపతి. 1983 లో డిగ్రీ చదువుతున్న సమయంలోనే ఆకర్షితులయ్యాడు. డిగ్రీ పూర్తి కాకముందే అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు. దళసభ్యుడి స్థాయి నుంచి పొలిట్ బ్యూరో సభ్యుడి స్థాయి వరకు ఎదిగాడు. మిలిషియా జరిపే దాడుల్లో తిరుపతి నేర్పరి అనే పేరు ఉంది. తిరుపతి పై ఎన్ఐఏ రూ : కోటి రివార్డ్ ప్రకటించింది. ప్రధానమైన దాడుల్లో తిరుపతి పాత్ర ఉందని నిఘా వర్గాలు ఇప్పటికే గుర్తించాయి. ఇప్పటివరకు పోలీస్ రికార్డ్ ల్లో తిరుపతి పేరు నమోదు కాలేదు. ఈ నేపథ్యంలో తిప్పరి తిరుపతి లక్ష్యంగా కేంద్ర పోలీస్ బలగాలు అడవుల్లో జల్లెడ పడుతుంటే ఏమవుతుందో వేచి చూడాల్సిందే.

# యువత భవితకు ప్రభుత్వ పథకాలతో ధీమా

**శాతవాహన అర్బన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**




**శెనార్తి మీడియా, తిమ్మాపూర్:**

యువత తమ ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చెడు అలవాట్ల నుండి దూరంగా ఉండి సన్మార్గంలో పయనించాలి అని శాతవాహన అర్బన్ అభివృద్ధి సంస్థ (సుడా) చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. సోమవారం తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని క్రీడా మైదానంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మానకొండూర్ నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ఆయన టాస్ వేయగా కార్యక్రమానికి ప్రారంభం కల్పించారు. కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లు, బెట్టింగులు, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువకులు అలవాటు పడితే తమ భవిష్యత్తును నాశనం చేసుకోవడం తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా యువతకు భవిష్యత్తు భద్రత ఉంటుందని, వారు వాటి ద్వారా తమ జీవితం మెరుగుపరుచుకోవాలని సూచించారు. క్రీడల ద్వారా మానసిక సంతోషం కలుగుతుందని, అందుకే యువజన కాంగ్రెస్ తరపున క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ఆయన వివరించారు. యువతలో మంచి మార్పు కోసం ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, మామిడి అనిల్ కుమార్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, నిర్వాహకులు గుర్రం వాసు, తాళ్లపల్లి శ్రీకాంత్, తుర్తి అరవింద్, ఎల్కపల్లి సిద్దార్థ్, ముక్కెర సతీష్ కుమార్, మహేశ్ చంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 32 జట్లు పాల్గొంటున్నాయి. ప్రారంభ మ్యాచ్ తిమ్మాపూర్ మండలం గొల్లపల్లి, మానకొండూర్ మండలం వన్నారం జట్ల మధ్య జరిగింది.





## ప్రజావాణికి 40 అర్జీలు

**శెనార్తి మీడియా, ములుగు :**


జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, అందిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలంటూ కలెక్టర్ దివాకర్ టి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 40 ఫిర్యాదులు అందాయి. ములుగు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు కలెక్టర్ దివాకర్, అదనపు కలెక్టర్లు సి.హెచ్.మహేందర్, సంపత్ రావులకు తమ సమస్యలను వివరించి అర్జీలు సమర్పించారు. భూ సమస్యలకు సంబంధించిన 13, గృహ నిర్మాణానికి 15, పెన్షన్‌కు 2, ఉపాధి కల్పనకు 1, ఇతర శాఖలకు సంబంధించిన 9 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులను పెండింగ్‌లో వేయకుండా, సంబంధిత శాఖలకు తక్షణమే బదిలీ చేసి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


### సిరిసిల్లలో182 దరఖాస్తులు

**శెనార్తి మీడియా, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 182 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇందులో రెవెన్యూ -75, హౌసింగ్ -36, ఎస్డీసీ- 12, డీఆర్డీఓ, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ కు తొమ్మిది చొప్పున, ఎస్పీ కార్యాలయానికి 6, జిల్లా ఉపాధి కల్పన అధికారి, నీటి పారుదల శాఖ కు 5 చొప్పున, జిల్లా సంక్షేమ అధికారికి 4, వ్యవసాయ శాఖ, జిల్లా విద్యాశాఖ అధికారి, ఏడీ టెక్స్టైల్స్, సబ్ రిజిస్టర్, ఏడీ ఎస్ఎల్ఏ కు రెండు చొప్పున తెదితర శాఖలకు దరఖాస్తులు వచ్చాయి.

# నంబాలను బంధించి కాల్చి చంపారు

**లేఖ విడుదల చేసిన మావోయిస్టులు**





**శెనార్తి మీడియా, ప్రత్యేక ప్రతినిధి:**

మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవ రావు అ లియాస్ బసవరాజు మృతిపై మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. నంబాల కేశవరావను పట్టుకుని తర్వాత భద్రతా దళాలు కాల్చి చంపాయని తెలిపారు. ఈ మేరకు మావోయిస్టు పార్టీ ఓ లేఖను విడుదల చేసింది. లొంగిపోయిన మావోయిస్టులు అందించిన సమాచారం తోనే భద్రతాదళాలు అక్కడ కూంబింగ్ జరిపాయని అందులో పేర్కొన్నారు. మావోయిస్టు స్పెషల్ జోనల్ కమి టీ ప్రతినిధి వికల్ప పేరిట మావోయిస్టులు సోమవారం లేఖ విడుదల చేశారు. తమ నాయకుడిని కాపాడుకోవడంలో తాము విఫలమయ్యామని తెలిపారు. కేశవరావు టీంలో ఉన్న ఆరుగురు సభ్యులు ఇటీవల ప్రభుత్వానికి లొంగిపోయారని వారు ఇచ్చిన సమాచారంతోనే ఇంతటి దారుణం జరిగిందని తెలిపార. ఎన్ కౌంటర్ ముందు రోజు నుంచి ఇరవై వేలమంది భద్రతాబలగాలు తమ ప్రాంతాన్ని చుట్టుముట్టాయని, పది గంటల్లో ఐదు ఎన్ కౌంటర్లు జరిగాయని తెలిపారు. కేశవ రావు 6 నెలలుగా మాడ్ ప్రాంతంలో ఉన్నట్లు నిఘా వర్గాలకు తెలుసన్నారు. నంబాల భద్రతలో ప్రధాన పాత్ర పోషిస్తోన్న సివైపిసి సభ్యులు కూడా ద్రోహానికి పాల్పడ్డ వారిలో ఉన్నారని తెలిపారు. మాడ్ ఉద్యమానికి నాయకత్వం వహించిన యూనిఫైడ్ కమాండ్ సభ్యుడు కూడా దేశద్రోహిగా మారాడని, దీంతో భద్రతా దళాల పని సులువైందని, రీకితో సహా ఈ దేశ ద్రోహు లందరూ కూడా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారని తెలిపారు. నారాయణపూర్ జిల్లా మాడ్ ప్రాంతంలోని గుండెకోట్ అడవిలో 2026, మే 21 జరిగిన ఎన్ కౌంటర్లో నంబాల మృతి చెందారని ధృవీకరించారు. ఆయనతో పాటు మరో 28 మంది మావోయిస్టులు మరణించారని వెల్లడించారు. ఈ మేరకు ఈ ద్రోహుల కారణంగానే ఇంత పెద్ద నష్టాన్ని చవి చూడాల్సి వచ్చిందని, మే 19న నంబాల ఉన్న సమీప గ్రామానికి పోలీసు బృందం చేరుకుందని సమాచారం అందిన తర్వా త ఆ ప్రాంతం నుండి వేరే ప్రాంతానికి బయలుదేరాం. 19వ తేదీ ఉదయం నుంచి ఐదు ఎన్‌కౌంటర్‌లు జరిగాయి కానీ ఎటువంటి నష్టం జరగలేదు. -మే 20 రాత్రి వేలాది మంది పోలీసు బలగాలు చుట్టుముట్టాయి. 60 గంటల పాటు భద్రత దళాలు నిర్బంధించాయి. కేశవ రావును సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు ప్రయత్నించాం. కానీ మమ్మల్ని వదిలి బయటకు వెళ్లేందుకు ఆయన ఇష్టపడలేదు. ముందుండి మమ్మల్ని నడిపించారు. కేశవరావుని కాపాడుకునేందుకు 35 మంది ప్రాణాలు అడ్డుపెట్టారు. కానీ మే 21న జరిగిన ఆపరేషన్‌లో నంబాలతో పాటు 28 మంది మావోయిస్టులు మరణించారు. ఈ ఎన్ కౌంటర్‌లో ఏడుగురు సురక్షితంగా బయటపడ్డారు 'అని సదరు లేఖలో పేర్కొన్నారు. కాగా ఈ ఎన్‌కౌంటర్‌లో 27 మంది మృతి చెందినట్లు ప్రభుత్వం వెల్లడించిందని, అయితే, మరో మృతదేహాన్ని తాము తీసుకెళ్లామని లేఖలో వెల్లడించారు. పాక్ తో శాంతి చర్చలకు సిద్ధమైన భారత ప్రభుత్వం తమతో మాత్రం చర్చలకు సిద్ధం కాలేదని మావోయిస్టులు లేఖలో పర్కన్నారు. తాము కాల్పుల విరమణను పాటించినా భద్రతాదళాలు మాత్రం దానిని పాటిచంలేదని తెలిపారు.

# గ్రీవెన్స్ డేలో 18 ఫిర్యాదుల స్వీకరణ



**శెనార్తి మీడియా, సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఎస్పీ మహేశ్ బీ గితే అర్జీలు స్వీకరించారు. మొత్తం 18 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా సత్వరం పరిష్కరించాలని ఆదేశిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించాలని సూచించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

## బీఆర్ఎస్ నేతలపై పోలీసుల లాఠీఛార్జి హేయం

**మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్**

**శెనార్తి మీడియా, సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ నివాస క్యాంప్ కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో పెట్టాలని కాంగ్రెస్ నేతల డిమాండ్‌తో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీఛార్జి చేశారు. దీన్ని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ నాయకులు గిచ్చి కయ్యం పెట్టుకుంటున్నారని, సిరిసిల్లలో ఉన్న కేటీఆర్ నివాస క్యాంప్ ఆఫీస్ అని, అది ఎమ్మెల్యే కార్యాలయం కాదన్నారు. అది కేవలం ఎమ్మెల్యే కోసం నిర్మించుకున్న గృహమేనని అన్నారు. శాసనసభ్యులు నిర్మించుకున్న ఇంటిలో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో ఎలా పెడతారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం హేయమైన చర్య అని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

## ఘనంగా సిద్దేశ్వరునికి పల్లకీ సేవ

**ఆర్మూర్, మే 26 :** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నవనాథ సిద్ధుల గుట్టపై సోమవారం రోజు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి నవనాథ సిద్దేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ నంది మహారాజ్ ఆధ్వర్యంలో రామాలయం నుండి కోనేరు వరకు తిరిగి రామాలయం వరకు ఘనంగా పల్లకి సేవను భక్తి పాటలు పాడుతూ భజన చేస్తూ నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు.




# నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

**కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం**



**శెనార్తి మీడియా, కరీంనగర్:**

నేరాల నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సీపీ గౌస్ ఆలం అన్నారు. జమ్మికుంట,వీణవంక పోలీస్ స్టేషన్లను సీపీ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులతో మాట్లాడి శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుం టున్న చర్యలపై సమీక్షించారు. ముందుగా జమ్మికుంటలోని రైల్వే స్టేషన్, గాంధీ చౌరస్తా తదితర ముఖ్యమైన రద్దీ ప్రాం తాలను సందర్శించారు. రద్దీ ప్రాం తాల్లో ప్రజల భద్రతకు తీసుకుంటున్న చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థను పరిశీలించారు. అనంతరం సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ రద్దీ ప్రాం తాల్లో నిఘా పటిష్ఠం చేయాలన్నారు. సీపీ వెంట టౌన్ సీఐ రామకృష్ణ, జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్, ఎస్ఐ తోట తిరుపతి, ప్రొబేషనరీ ఎస్ఐ సాయికృష్ణ, ఏఎస్ఐ రవి పాల్గొన్నారు.

### పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

**శెనార్తి మీడియా, మానకొండూరు:** మండలంలోని వేగురుపల్లి గ్రామంలో పేకాడుతున్న ఐదుగురిని టాస్క్ ఫోర్స్ బృందం పట్టుకుంది. టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్ గోపతి రవీందర్ సూచనలతో మానకొండూరు పోలీసులు పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.10,460 , పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. జూదం, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుం టామని పోలీసులు హెచ్చరించారు.

